హైదరాబాద్ వార్త






# ఆరోగ్య 'యోగ'ం

-సకలరోగాలు, రుగ్మతలకు పరిష్కారం -నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం



**హైదరాబాద్, జూన్ 20,ప్రభాతవార్త:** "పంచేంద్రియాం నయనం ప్రధానం" అంటే పంచేద్రియాలలో కళ్లు అతిముఖ్యమైనవని అర్థం. ఒక అవయాన్ని ప్రస్తావించేటప్పుడు చెప్పే సూక్తి ఇది.కానీ మనిషి ఆరోగ్యవంతమైన జీవన గమనానికి అన్ని అవయవాలు సక్రమంగా పనిచేయాలి. అలా చేయాలంటే సర్వోత్తమమైన మార్గమే యోగా.రోజూ గంటపాటు దీనిని ఆచరించిన వారికి జీవింతంలో ఆరోగ్యయోగం లభిస్తుంది. ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభాతవార్త ప్రత్యేక కథనం.

**యోగా దినోత్సవ నేపథ్యం...**

యోగా ఒక ఆరోగ్య ప్రసాదిని అని భారతదేశంలో ఐదువేల ఏళ్లక్రితమే గుర్తించి, ఆసనాలు, సూర్యనమస్కారాలను ఆచరించారు. దీని ప్రాధాన్యత గుర్తించిన భారత ప్రభుత్వం. ప్రపంచ వ్యాప్తంగా చేయాలనే ఉద్ధేశ్యంతో 2014లో ఐక్యరాజ్యసమితిలో ప్రతిపాదన పెట్టింది. అదే సంవత్సరం సెప్టెంబర్‌లో దానికి ఆమోదం లభించింది. జూన్ 21వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా యోగా దినోత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించింది. దీంతో అప్పటి నుండి ప్రపంచ వ్యాప్తంగా పలుదేశాల్లో దీనిని ఆచరిస్తున్నారు. ముఖ్యంగా భారత దేశంలో యోగాకు విస్రతమైన ఆదరణ ఉంది. దేశవ్యాప్తంగా ఈరోజున అవగాహాన కల్పించేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు, సిద్ధమవుతున్నాయి.

**ఎన్నో ఆసనాలు..**

యోగాలో 87లక్షల రకాల ఆసనాలు,ప్రక్రియలు ఉన్నాయని.. కాలక్రమంలో అవి 27రకాలుగా రూపొందాయని యోగా నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా పాదహస్తాయనం, వక్రాసనం, త్రికోణ ఆసనం, వృత్తత్రికోణ ఆసనం, భుజంగ ఆసనం, సెలభ ఆసనం, ధనుర్ ఆసనం,ఉత్తాన పద ఆసనం, పవన యుక్త ఆసనం, చక్రాసనం, సర్వాంద ఆసనం, మత్స్యాసనం, పద్మాసనం, వజ్రపాసనం, ఊస్ట్రాసనం, సంపూర్ణ మత్స్యేంద్ర ఆసనం ఉన్నాయి. ప్రాణాయామం విభాగంలో తపాలభాతి, అనులోమ,విలోమ ప్రాణాయానం, భ్రమరీ ప్రాణాయామం, సీతలీ ప్రాణాయామం, సీతలీ, సీత్కారీ, సదాంత, సూర్యభేద యామం ఉన్నాయి. ఇవికాక సూర్యనమస్కారాలు ఉన్నాయి. ఒక్కో ఆసనం ఒక్కో అవయవంలో కదలి కలను తెస్తూ మనిషి ఆరోగ్యవంత జీవనానికి దోహదం చేస్తాయి.

**రోజుకో గంట...జీవితం ఆరోగ్యవంట**

రోజురోజుకూ మనిషి యాంత్రిక జీవనయానంలో పడి ఆనారోగ్యాలకు గురవుతునాన్నడు. అతిపిన్న వయస్సులో గుండెపోటు, క్యాన్సర్, షుగర్, ఆస్తమా , జీర్ణకోశ, శ్వాసకోశ, కండరాల నొప్పి, థైరాయిడ్ వంటి రోగాల భారిన పడుతున్నాడు. ప్రతి మనిషి ఒగంట యోగాను ఆచరిస్తే జీవితాంతం ఆరోగ్యంతో జీవించవచ్చని యోగా నిపుణులు చెబుతున్నారు. ఒక్కో రోగానికి ఒక్కో ఆసనం యోగాలో ఉన్నాయని ఈ ఆసనాలు వల్ల పంచేంద్రియాలు, జీర్ణ, శ్వాస, రక్త ప్రసరణ వ్యవస్థలు అదుపులో ఉంటాయని అంటున్నారు. యోగాతో ఆరోగ్యంతోపాటు మానసిక రుగ్మతలను కూడా అదపులో ఉంచుకునే అవకాశాలు ఉన్నాయని,నిత్యం యోగా సాధనతో మనోనిబ్బరాన్ని నింపుకొని మానసిక ఒత్తిడిని తట్టుకుని, ప్రశాంతంగా ఉండే అవకాశం ఉందని యోగాను ఆచరిస్తున్న వారు వివరిస్తున్నారు.

**ఉపాధి"యోగా"**

ఇప్పుడు యోగా ఆరోగ్య ప్రధాయినిగానే కాకుండా ఉపాధి యోగం కల్పించే అవకాశంగా మారింది. ప్రపంచంతోపాటు దేశంలో యోగా పట్ల విస్రత ఆదరణ పెరుగుతన్న నేపథ్యంలో యోగా గురువుల అవసరం ఏర్పడుతోంది. విద్యాసంస్థల్లో బోధన ఒత్తిడిని విద్యార్థులు తట్టుకునేందుకు యోగా సాధన చేయించేందుకు ఆయా సంస్థలు ఆసక్తిని ప్రదర్శిస్తున్నాయి. ఈనేపథ్యంలో యోగా నేర్పించేవారి అవసరం ఏర్పడుతుంది. యోగా సాధన కేంద్రాలను కూడా పట్టణ ప్రాంతాల్లో విస్రంతంగా ఏర్పాటు చేస్తునాన్నరు. హైదరాబాద్ లో సుమారు 200పైగా యోగా కేంద్రాలను నిర్వహిస్తున్నారు. దీంతో యోగా నిపుణులకు ఉపాధి అవకాశాలు మెండుగా పెరుగుతున్నాయి. అంతేకాకుండా దేశంలోని పలు యూనివర్సీటీలు యోగా కోర్సును ప్రవేశపెడుతున్నాయి.

# వర్షాకాలంలో అనునిత్యం అప్రమత్తం అవసరం

ఎలాంటి ప్రాణ,ఆస్తి నష్టం జరగకుండా చూసుకోవాలి
హైడ్రా బృందాలకు మంత్రి పొన్నం దిశానిర్దేశం



డిఆర్ఎఫ్ బృందాల పనిముట్లను పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, హైడ్రా కమిషనర్ రంగనాథ్ తదితరులు

**హైదరాబాద్, జూన్ 20,ప్రభాతవార్త:** వర్షాకాలం అనునిత్యం అప్రమత్తంగా ఉండి.. నగర ప్రజలకు ఇబ్బందులు కలగకుండా హైడ్రా జాగ్రత్తలు తీసుకోవాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. వాతావరణంలో వచ్చిన మార్పుల దృష్ట్యా.. నెల రోజుల్లో పడాల్సిన వర్షం ఒక్క రోజులో.. ఒక్క రోజులో కురవాల్సిన వర్షం ఒక గంటలో పడుతున్న వేళ ప్రతి నిమిషం అప్రమత్తంగా ఉన్నప్పుడే ప్రజలకు వరద కష్టాలు లేకుండా జాగ్రత్త పడగలనమని అన్నారు. మాన్సూన్ రెస్పాన్స్ టీమ్‌లతో శనివారం జలవిహార్‌లో హైడ్రా ఏర్పాటు చేసిన సమావేశానికి హైదరాబాద్ ఇన్చార్జ్ హోదాలో ముఖ్య అతిథిగా హాజరైదిశానిర్దేశం చేశారు. ఏ నిమిషంలో నిర్లక్ష్యంగా ఉన్నా.. నగర ప్రజలు వరదముప్పును ఎదుర్కొని ఇబ్బందులు పడాల్సి ఉంటుందని హెచ్చరించారు. వర్షాకాలం హెచ్చరికలను దృష్టిలో పెట్టుకుని 150 రోజులు సన్నద్ధంగా ఉండాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాల వేళ చెట్టుకొమ్మలు విరిగిపడడం.. కరెంటు తీగలు తెగిపడడం ఇలా రకరకాల కారణాల వల్ల ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు ఎలాంటి హాని లేకుండా చూసుకోవాలని సూచించారు. మాన్సూన్ ఎమర్జన్సీ టీమ్‌లు (మెట్) అనడం కంటే.. మాన్సూన్ రెస్పాన్స్ టీమ్‌లుగా పిలవడం సందర్భోచితమని మంత్రి ఈ సందర్బంగా సూచించారు. ప్రభుత్వం, హైడ్రా, జీహెచ్ఎంసీ, ట్రాఫిక్, అగ్నిమాపక, వాతావరణ శాఖలు 24 గంటల పాటు సమన్వయంతో పనిచేస్తున్నాయని.. ప్రజలు ఆందోళన చెందాల్సిన పని లేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వంతో పాటు.. ప్రజలకు కూడా హైడ్రా పనులపై ఎంతో విశ్వాసం ఉందని.. దానిని నిలబెట్టుకోవాల్సినవసరం ఉందని చెప్పారు. మూడు కమిషనరేట్లతో సమన్వయం చేసుకుని పని చేసే బాధ్యత తీసుకోవాలన్నారు.

**24గంటలు సేవలందించేలా ఏర్పాట్లు..**

అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు 51 డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) బృందాలు, 300 మాన్సూన్ రెస్పాన్స్ టీమ్‌లు, 889 స్టాటిక్ టీమ్‌లు సిద్ధంగా ఉన్నాయని హైడ్రా కమిషనర్ రంగనాథ్, అదనపు డైరెక్టర్ వర్ల పాపయ్య చెప్పారు. చెట్లు కూలిన ఘటనలకు తక్షణ స్పందన కోసం 20 బైక్ క్విక్ రెస్పాన్స్ యూనిట్లను కూడా అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. నగరంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో నీరు వేగంగా తొలగించేందుకు 371 డీవాటరింగ్ పంపులను వ్యూహాత్మక ప్రాంతాల్లో ఏర్పాటు చేసినట్లు వివరించారు. అదేవిధంగా 60 ఫ్లైఓవర్లు, 38 అండర్‌పాస్‌లు, 705 చెరువులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు. వర్షం పడుతున్నప్పుడు వరదను తొలగించడానికి.. వర్షం లేనప్పుడు వరదకు గల కారణాలపై హైడ్రా బృందాలు దృష్టి పెడతాయన్నారు. హైడ్రా మాన్సూన్ రెస్పాన్స్ టీమ్‌లు 300లుంటే.. అందులో 3600ల మంది అందుబాటులోకి వచ్చినట్టయ్యిందన్నారు. అంతకు ముందు హైడ్రా అదనపు కమిషనర్ ఆర్ సుదర్శన్ మాట్లాడుతూ.. మెట్ కాంట్రాక్టర్లతో పాటు.. పని చేసే సిబ్బందికి అన్ని సౌకర్యాలు కల్పించడమే కాకుండా.. వర్షాకాలం అవసరమైన పనిముట్లు అందజేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో హైడ్రా ఆర్ఎఫ్ఓ జయ ప్రకాష్‌తో పాటు డీ ఎఫ్‌వోలు, ఎస్ఎఫ్‌వోలు పాల్గొని మెట్ బృందాలకు పలు సూచనలు చేశారు.

## వైద్యులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రోగులు



అడ్డగుట్టలో డాక్టర్లు, పేషెంట్‌లు లేక వెలవెలబోతున్న ప్రభుత్వ ఆసుపత్రి

**అడ్డగుట్ట,జూన్ 20 ప్రభాతవార్త:** దక్షిణ భారత దేశంలో అతి పెద్ద మురికివాడగా పేరొందిన అడ్డగుట్టలో కొనసాగుతున్న హర్బన్ హెల్త్ పోస్టు (యూపి హెచ్ సీ)లో దాదాపు సంవత్సరం నుంచి మెడికల్ ఆఫీసర్ లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురికివాడలు, సామాన్యప్రజలు నివసించే ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం యూపిహెచ్‌సీలను ఏర్పాటు చేయడంతో పాటు బస్తీ దావఖానాలను ఏర్పాటు చేశారు. 30 వేల జనాభా కలిగిన అడ్డగుట్టలో ఉన్న యూపిహెచ్‌సీలో వైద్యం చేయించుకునేందుకు ప్రతి రోజు 150 మంది ఓపీ పేషెంట్‌లు వస్తుంటారు. ఈ ఆసుపత్రిలో వైద్య సేవలు అందించే మెడికల్ ఆఫీసర్ పోస్టు సంవత్సరం నుంచి ఖాళీగా ఉంది.గతంలో మెడికల్ అఫీసర్‌గా పనిచేసిన సాయి శంకర్ బదిలీపై వెళ్ళారు. ఆయన స్థనంలో డాక్టర్ సంగీత వచ్చారు. ఆమెకు ఈ ఇన్ సర్వీస్ కోటాలో పీజీ సీట్ రావడంతో ఆ పోస్టు ఖాళీగా ఏర్పడింది. అదేవిధంగా ఈ ఆసుపత్రిలో స్టాప్ నర్సు ,ల్యాబ్ టెక్నిషియన్ పోస్టులు కూడా ఖాళీగా ఉండడంతో ఆసుపత్రికి వచ్చే రోగులకు అటు మెడికల్ ఆఫీసర్,స్టాప్ నర్సు,ట్యాబ్ టెక్నిషియన్‌లు లేక పోవడంతో అడ్డగుట్ట ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.వైద్యం చేయించుకునేందుకు ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే వైద్య సిబ్బంది లేక ప్రైవేట్ ఆసుపత్రుల వైద్యులను సంప్రదిం చాల్సివస్తుందని స్థానికులు వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అడ్డగుట్ట ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.




## పకడ్బందీగా వర్షాల ముందస్తు చర్యలు

-కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి



స్థానికులచే సమస్యలు తెలుసుకుంటున్న కమీషనర్ వినయ్ కృష్ణారెడ్డి

**హైదరాబాద్, జూన్ 20 ప్రభాతవార్త :** వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలను పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. శనివారం మౌలాలి ఫ్లైఓవర్, లాలాపేట్, ఈస్ట్ ఆనంద్‌బాగ్, వాణినగర్, మారుతినగర్ ప్రాంతాల్లో అధికారులతో కలిసి ఆయన విస్తృతంగా పర్యటించి పరిస్థితులను సమీక్షించారు. లాలాపేట్‌లోని మోలాలి ఫ్లైఓవర్ పరిసర ప్రాంతాల్లో నీరు నిలిచే ప్రాంతాలు, ఓపెన్ నాలాలు, వరద నీటి కాలువలను పరిశీలించిన కమిషనర్, నాలాలు, డ్రెయిన్లలో పేరుకుపోయిన పూడికను ఎప్పటికప్పుడు తొలగించా లని అధికారులను ఆదేశించారు. నీటి ప్రవాహానికి ఆటంకంగా ఉన్న అడ్డం కులను వెంటనే తొలగించి, భారీ వర్షాల సమయంలో రహదారులపై నీరు నిల్వ కాకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం ఈస్ట్ ఆనంద్‌బాగ్‌లో స్టార్మ్ వాటర్ డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించిన ఆయన, ఎత్తైన ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరు సక్రమంగా నాలాల్లోకి మళ్లి నివాస ప్రాం తాల్లోకి చేరకుండా తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. డ్రెయినేజీ వ్యవస్థను మరింత బలోపేతం చేసి నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. వాణినగర్, మారుతినగర్ ప్రాంతాల్లో పర్యటించిన కమిషనర్, ఓపెన్ నాలాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త పేరుకుపోవడం వల్ల వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతున్నట్లు గుర్తించారు. వెంటనే చెత్తను తొలగించి, నాలాలు, స్టార్మ్ వాటర్ డ్రెయిన్లలో క్రమం తప్పకుండా డీసిల్టింగ్ పనులు చేపట్టాలని సూచించారు. అలాగే రహ దారుల పక్కన అక్రమంగా పారవేస్తున్న నిర్మాణ వ్యర్థాలను తొలగించి, ఇందుకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించా రు.భారీ వర్షాల సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ పర్యటనలో డిప్యూటీ కమిషనర్, డీఈ, ఏఈలు, హైడ్రా, రామ్‌కీ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## గంజాయి డాన్ నీతూభాయి అక్రమ నిర్మాణాలు నేలమట్టం



గంజాయి డాన్ నీతూభాయి రహదారిని ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను కూల్చివేస్తున్న దృశ్యం

**గచ్చిబౌలి, జూన్ 20 ప్రభాతవార్త**

ఐటి కారిడార్‌లో గంజాయి అక్రమ వ్యాపారంపై ఉక్కుపాదం మోపుతున్న సైబరాబాద్ పోలీసులు మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. గంజాయి వ్యాపారాన్ని కూకటివేళ్లతో పెకిలించేందుకు నిర్ణయించిన గచ్చిబౌలి పోలీసులు శేరిలింగంపల్లి సర్కిల్ అధికారులతో కలిసి గంజాయి డాన్ నీతూ భాయి అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేశారు. రహదారిని ఆక్రమించి తాత్కాలిక నిర్మాణాలు ఏర్పాటు చేసి, వాటిలో పేరుకు కొన్ని వాణిజ్య సముదాయాలను కొనసాగిస్తూ... వాటి మాటున గంజాయి వ్యాపారం చేస్తుండడంతో పోలీసులు ఈ వ్యాపార సముదాయాలపై దృష్టి సారించారు. నానక్‌రాంగూడలో ఓ రహదారి మొత్తం రోడ్డుకు ఇరువైపులా ఆక్రమించి, సదరు రోడ్డులోకి వచ్చే వారి రాకపోకలను ఎప్పటికప్పుడూ తెలుసుకుంటూ నీతుభాయి ఓ సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసుకుంది. రోడ్డును ఆక్రమించి చేపట్టిన సదరు తాత్కాలిక నిర్మాణాల్లో కిరాణా దుకాణాలు, కూల్‌డ్రింక్ షాపులు, చికెన్ షాపులను పేరుకు నిర్వహిస్తూ వాటి మాటున గంజాయి విక్రయం చేపడుతుంది. ఈ దుకాణాలతో ఎల్లవేళలా నిఘా ఉంచుకుంటూ తన వ్యాపారాన్ని కొనసాగిస్తుంది. ఒకవేళ పోలీసులు అక్కడికి వెళ్లినా క్షణాల్లో సమాచారం తెలుసుకుంటూ పోలీసులకు దొరక్కుండా తప్పించుకుంటుంది. ఇప్పటికే గంజాయి డాన్ నీతూభాయి మీద పోలీసులు పిడి యాక్ట్ నమోదు చేసినా తన వ్యాపారం మాత్రం ఆపలేకపోతున్నారు. గత రెండురోజుల క్రితం నీతూ భాయి అనుచరుడు గంజాయితో పోలీసులకు పట్టుబడడంతో నీతూభాయి దందా మరోసారి జోరందుకుందని గుర్తించారు. దీంతో పోలీసులు ఈ విషయమై శేరిలింగంపల్లి సర్కిల్ అధికారులతో చర్చించి అక్రమ నిర్మాణాలపై చర్యలకు పూనుకున్నారు. రహదారిని ఆక్రమించి రోడ్డుకు ఇరువైపులా వెలసిన తాత్కాలిక నిర్మాణాల కూల్చివేత చేపట్టారు. గచ్చిబౌలి పోలీసులు, శేరిలింగంపల్లి సర్కిల్ అధికారులు శనివారం జెసిబిలతో రహదారి ఆ క్రమణలను మొత్తం నేలమట్టం చేశారు.

## వైభవంగా టిటిడి వేంకటేశ్వరస్వామి బ్రహోత్సవాలు



ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు, యు.రమేష్ తదితరులు

**సైఫాబాద్, జూన్ 20 ప్రభాతవార్త:** హిమాయత్‌నగర్‌లోని టిటిడి బాలాజీభవన్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం 21వ వార్షిక బ్రహోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా కన్నుల పండువగా ప్రారంభమైనాయి. దేవాలయాన్ని రకరకాల రంగులు, విద్యుత్ దీపాలతో అలంకరణ, చలువ పందిళ్లు, ముత్యాల ముగ్గులతో, వేలాది మంది భక్తులతో దేవాలయం, హిమాయత్‌నగర్ కళకళలాడింది. భక్తుల రద్దిని తట్టుకునేలా క్యూలైన్‌ల ఏర్పాట్లు చేశారు. ఉదయం శ్రీవారికి సుప్రభాతం, సర్వదర్శనం, సహస్రదీపాలంకరణ, ఏకాంత సేవ తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. దేవాలయం ప్రాంగణంలో ధ్వజారోహణ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు, ఎమ్మెల్యే దానం నాగేందర్, దేవాలయం లోకల్ అడ్వైజరీ కమిటీ అధ్యక్షుడు నేమూరి శంకర్‌గౌడ్, ఎఈవో యు.రమేష్, ఇన్‌స్పెక్టర్ మణికంఠ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి ఊరేగింపు శేష వాహనంపైన, సాయంత్రం హనుమంత వాహనంపైన పురవీధుల్లో కొనసాగింది. ఈ సందర్భంగా మహిళలు స్వామివారికి మంగళ హారతులతో స్వాగతం పలికారు. పురవీధులు గోవిందనామాలతో మారుమ్రోగాయి. మహిళల కోలాటాలు, సన్నాయి రాగాలు, డోలు మేళాలు, భక్తి గీతాలతో పురవీధులు అధ్యాత్మికతను సంతరించుకున్నాయి. ఊరేగింపులో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాధాలతోపాటు ఉదయం అల్పహారం, మధ్యాహ్నం, రాత్రికి అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ బ్రహ్మోత్సవాలు ఈ నెల 24వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ బ్రహోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని రమేష్ విజ్ఞప్తి చేశారు. కాగా బాలాజీ భవన్ భక్తుల సొసైటి నుంచి ప్రతినిధులు శ్రీనివాస్ (వాసు మెడికల్ హాల్), వేణు మనోహార్ తప్పా మిగతా వారేవ్వరు హాజరు కాలేదు.

## 22 వ తేదీ నుంచి హైడ్రా ప్రజావాణి యథాతథం

**హైదరాబాద్, జూన్ 20,ప్రభాతవార్త:** హైడ్రా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 22వ తేదీ నుంచి యథాతథంగా కొనసాగిస్తున్నట్టు హైడ్రా శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. వర్షాకాలాన్ని దృష్టి పెట్టుకుని.. ఎదురయ్యే సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు చెప్పింది. నగరంలో వర్షాకాలం ఎదురయ్యే సమస్యలు, నీట మునిగే ప్రాంతాలు, అందుకు గల కారణాలను ఫిర్యాదులో వివరంగా పేర్కొనాలని సూచించింది. వాటి పరిష్కారానికి హైడ్రా అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపింది. వరద కాలువలు, చెరువుల కబ్జాలతో పార్కులు, ప్రభుత్వ భూములు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల ఆక్రమణలు ఏవైనా ఉంటే హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేయవచ్చునని పేర్కొంది. వరదలకు గల కారణాలను వివరించడంతో పాటు...ఎప్పటి నుంచి ఆ సమస్య ఉందో తెలపాలని సూచించింది.

## బోనాల ఉత్సవాలకు చెక్కులు పంపిణీ



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

**జూబ్లీహిల్స్, జూన్ 20, ప్రభాతవార్తః** రాబోయే బోనాల ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం అందజేస్తున్న అదనపు ఆర్థిక సహాయాన్ని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే దానం నాగేందర్ శనివారం తన క్యాంపు కార్యాలయంలో దేవాలయ కమిటీలకు పంపిణీ చేశారు. బంజారానగర్, పటేల్ నగర్, దుర్గాభవాని నగర్, దీన్ దయాళ్ నగర్ ప్రాంతాలకు చెందిన మొత్తం 14 దేవాలయాల కమిటీలకు ఒక్కో దేవాలయానికి రూ.20 వేల చొప్పున అదనపు నిధుల చెక్కులను అందజేశారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ విజ్ఞప్తి మేరకు దేవాదాయ శాఖ ఈ అదనపు నిధులను మంజూరు చేసినట్లు తెలిపా రు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బోనాల పండుగను భక్తిశ్రద్ధల తో, ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందని పేర్కొన్నారు. దేవాలయ కమిటీలు సమన్వయంతో ఉత్సవాలను విజయ వంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మామి డి నర్సింగ్‌రావు, ఆకుల రాజు, మధుకర్, కిరణ్, విజయరావు, రమేష్‌తో పాటు పార్టీ నాయకులు, దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మొహర్రం ఊరేగింపు సందర్భంగా ఏనుగు ట్రయల్ వాక్..

- నగరంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

-బీబీకా ఆలం ఊరేగింపునకు రెండు వేల మంది పోలీస్ సిబ్బంది : సిపి వి.సి.సజ్జనార్



చార్మినార్ మీదుగా ఏనుగు ట్రయల్ వాక్ జరుగుతున్న దృశ్యం

**చార్మినార్,జూన్ 20 ప్రభాతవార్త :** మొహర్రం సందర్భంగా హైదరాబాద్ పాతబస్తీ డబీర్‌పురలోని చారిత్రాత్మక బీబీకా ఆలంను శనివారం హైదరాబాద్ నగర్ పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనర్ సందర్శించి దట్టీలు సమర్పించారు.అనంతరం నగర పోలీస్ కమిషనర్ వీ.సి. సజ్జనర్ ఊరేగింపులో ప్రధాన ఆకర్షణగా నిలిచే శ్రీదేవి ఏనుగు ట్రయల్ వాక్‌ను ఎమ్మెల్సీ మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెందీతో కలిసి ప్రారంభించారు.మొహర్రం భద్రతా ఏర్పాట్లను ఆయన ఉన్నతాధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.అనంతరం ఆయన ఊరేగింపు నిర్వహకులతో మాట్లాడి భద్రత పరంగా పోలీసులకు అన్ని విధాల సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీ.సి.సజ్జనర్ మాట్లాడుతూ మొహర్రం సందర్భంగా నగరంలో శాంతి భద్రతల పరిరక్షణకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశామని తెలిపారు.ఈ కార్యక్రమం ప్రశాతంమైన వాతావరణంలో కొనసాగేలే ప్రతీ ఒక్కరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.బీబీకాఆలం నుంచి ప్రారంభమైన ఏనుగు ట్రయల్ వాక్ ఎత్తెబార్ చౌక్,సర్దార్ మహల్, చార్మినార్,గుల్జాంహౌస్, ఫంజేషా,మీరాలం మండి,దారుషిఫా ప్రాంతాలు మీదుగా చాదర్‌ఘాట్ వరకు కొనసాగింది.ఈ కార్యక్రమంలో లా అండ్ ఆర్డర్ అడిషనల్ సిపి తఫ్సీర్ ఇక్బాల్,చార్మినార్ జోన్ డిసిపి ఖారే కిరణ్ ప్రభాకర్,టాస్క్‌ఫోర్సు డిసిపి వైభవ్ రఘునాద్ ,ట్రాఫిక్ డిసిపి బికె. రాహుల్ హెడ్డే,బిజెపి నాయకులు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీతో పాటు పలువురు పాల్గొన్నారు.

## శివసాయినగర్‌లో సిసి రోడ్డు పనులు ప్రారంభం


శివసాయినగర్‌లో సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న రాజు యాదవ్

**చాంద్రాయణగుట్ట, జూన్ 20, ప్రభాతవార్త :** ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని ఆ పార్టీ సీనియర్ నేత పుట్టా రాజు యాదవ్ తెలిపారు. ఉప్పుగూడ శివసాయినగర్‌లో సుమారు రూ.5.50లక్షల రూపాయలతో చేపట్టిన ఆధునిక సీసీరోడ్డు నిర్మాణ పనులను ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం రాజు మాట్లాడుతూ బస్తీలలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. నిరుపేద, మధ్య తరగతి ప్రజలు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గత రెండున్నరేళ్లుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన పథకాలను వివరించారు. అస్తవ్యస్త రోడ్డుతో ఇబ్బంది పడ్డ బస్తీవాసులు నూతన సీసీ రోడ్డు నిర్మాణంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు, బస్తీవాసులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం


యోగ చేస్తున్న దృశ్యం

**నిజాంపేట్, జూన్ 20, ప్రభాతవార్త**

ఆధునిక జీవనశైలిలో మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వం కోసం యోగా ఎంతో అవసరమని వైద్య నిపుణులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అజింక్య డి.వై. పాటిల్ హెల్త్‌కేర్‌కు చెందిన ఎస్ఎల్‌జీ ఆసుపత్రి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎల్‌జీ హాస్పిటల్ ఛైర్మన్ దండు శివరామరాజు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఒక్కరూ యోగాను అలవాటు చేసుకోవాలని అన్నారు. వేల ఏళ్ల క్రితమే ప్రారంభమైన యోగా నేటికీ ప్రాముఖ్యత కోల్పోకుండా కొనసాగుతోందని, ప్రపంచ దేశాలు కూడా యోగాను మరింత అభివృద్ధి చేశాయని పేర్కొన్నారు. ఆసుపత్రి ఆవరణలోని ప్రశాంత వాతావరణంలో ఉదయం 7 గంటలకు కార్యక్రమం ప్రారంభమైంది. ఈ యోగా సెషన్‌లో ఆసుపత్రి సిబ్బంది, వైద్యులు, విద్యార్థులు, ఆరోగ్యం పట్ల ఆసక్తి కలిగిన ప్రజలు సహ మొత్తం 290 మంది పాల్గొన్నారు. ప్రముఖ సర్టిఫైడ్ యోగా శిక్షకులు శ్రీదేవి, శ్రీహరి, వి. చలపతి, సంతోష్ కుమార్ మహాపాత్ర మార్గదర్శకత్వం వహించారు. వారు యోగా వల్ల కలిగే శారీరక, మానసిక ప్రయోజనాలను వివరించి, ప్రతిరోజూ యోగాను జీవనశైలిలో భాగంగా చేసుకోవాలని సూచించారు.

### కళాకారులు నేరాలకు దూరంగా ఉంటారు : జడ్జి మురళీమోహన్


హోం ఫర్ లైఫ్ ఫౌండేషన్ అధ్యక్షురాలు డాక్టర్ హిమజను సత్కరిస్తున్న హైదరాబాద్ జిల్లా జడ్జి మురళీమోహన్

**చిక్కడపల్లి , జూన్ 20 ( ప్రభాతవార్త ) :** సాధారణంగా కళలను ఆరాధించే కళాహృదయులు నేరాలకు దూరంగా ఉంటారని హైదరాబాద్ జిల్లా జడ్జి మురళీమోహన్ పేర్కొన్నారు. శనివారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో జరుగుతున్న త్రియం సప్తాహంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్న మురళీమోహన్ మాట్లాడుతూ తాను కూడా గతంలో మిమిక్రీ, మైమ్ కళాకారుడిగా పలు బహుమతులు అందుకున్నానని గుర్తుచేసుకున్నారు. మిమిక్రీ, మ్యాజిక్, మైమ్ అనేవి కేవలం వినోదం కోసం మాత్రమే కాదని, అవి గొప్ప కళా ప్రక్రియలని కొనియాడారు. అనంతరం హోం ఫర్ లైఫ్ ఫౌండేషన్ అధ్యక్షురాలు డాక్టర్ హిమజను ఘనంగా సత్కరించారు. సత్కారం అందుకున్న డాక్టర్ హిమజ మాట్లాడుతూ.. ప్రభుత్వ సహకారం లేకున్నా, వందలాది మందికి వివిధ నైపుణ్యాలలో శిక్షణ ఇస్తూ, నిరుపేదలకు ఆహార పంపిణీ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా మిమిక్రీ కళాకారులు జితేంద్ర, జబర్దస్త్ శాంతి కుమార్, రంగనాథ్ తమ అద్భుతమైన ప్రతిభతో ప్రేక్షకులను అలరించారు. అలాగే, ప్రఖ్యాత మిమిక్రీ కళాకారులు హరికిషన్, సుధా హరికిషన్ దంపతులను వేదికపై ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జి.వి.ఎన్. రాజు అధ్యక్షత వహించగా, మల్లం రమేష్ స్వాగతం పలికారు. త్యాగరాయ గానసభ, ఆనంద లహరి, భవిరి ఆర్ట్స్, హైదరాబాద్ మాజిషియన్స్ మావా సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి.

## ఏకా పద్మ స్మారక పురస్కారం ప్రదానోత్సవం సభ



**చిక్కడపల్లి , జూన్ 20 ( ప్రభాతవార్త ) :** శ్రీ కిరణ్ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు లంక వెంకటసుబ్రహ్మణ్యం, భాను ఆధ్వర్యంలో శనివారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళావేదికపై ఏకా పద్మ స్మారక పురస్కార ప్రదానోత్సవం సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ పారిశ్రామికవేత్త పి.పవన్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై, ప్రముఖ హోమియో వైద్యులు డాక్టర్ పి.భవానికి పురస్కారాన్ని అందజేసి మాట్లాడుతూ భార్య మరణించి ఎన్నో ఏళ్లు గడిచినా, ఆమె స్మృతులను గౌరవిస్తూ, వారి భర్త రామమోహనరావు ప్రతి ఏటా ప్రముఖులకు పురస్కారాలు అందిస్తూ ఆమెను శాశ్వతంగా స్మరించుకోవడం అభినందనీయం అని కొనియాడారు. కార్యక్రమంలో సంస్థ స్థాపకుడు లంకా వెంకట సుబ్రహ్మణ్యం స్వాగతోపన్యాసం చేయగా, సాహితీ కిరణం మేనేజర్ పొత్తూరి జయలక్ష్మి, పద్మ ఆప్టికల్స్ ఏకా నాగ రాజు, రామమోహనరావు, కె.కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు. చివరగా ఏకా ధర్మ సంవర్ధని వందన సమర్పణ చేశారు.


పేట్లబుర్జు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో యోగాసనాలు వేయిస్తున్న స్కూల్ అసిస్టెంట్ తెలుగు డాక్టర్ శ్రీవాటి శ్రీనాథ్

## స్వయం సహాయక సంఘాల పెంపునకు చర్యలు : జోనల్ కమిషనర్ సత్యనారాయణ



స్వయం సహాయక సంఘాల పనితీరు, పురోగతిపై అధికారులతో సమీక్షస్తున్న జోనల్ కమిషనర్ సత్యనారాయణ

**చాంద్రాయణగుట్ట, జూన్ 20, ప్రభాతవార్త :** ప్రస్తుతం ఉన్న స్వయం సహాయక సంఘాల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జీహెచ్ఎంసి చార్మినార్ జోనల్ కమిషనర్ కన్నం సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. నర్కిపూల్‌బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో శనివారం స్వయం సహాయక సంఘాల పనితీరు, పురోగతిపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్‌యంసీ కమిషనర్ ఆర్‌వికర్ణన్ ఆదేశాల మేరకు సహాయం సహాయక సంఘాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సూచన మేరకు స్వయం సహాయక సంఘాల్లో పాతబస్తి మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిపొందేలా చర్యలుండాలన్నారు. జోన్ పరిధిలోని అన్ని సర్కిల్‌లలో యుసిడి ఆధ్వర్యంలో నడుస్తున్న సంఘాలతో పాటు వార్డుల ప్రకారం మరిన్ని నూతన సంఘాలను ఏర్పాటు చేయాలన్నారు. ఎస్ఏండబ్ల్యూ 15 నుంచి 18 వయస్సు, సీనియర్ సిటిజన్స్, జనరల్, కేటగిరీల వారిగా సంఘాల సంఖ్యను పెంచాలన్నారు. ప్రతి ఒక్కరూ అన్ని ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి అదనపు గ్రూపుల ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుకు బ్యాంకు రుణాలు, ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందే విధంగా అధికారులు, ఉద్యోగులు కృషి చేయాలని సూచించారు. సర్కిల్ వారీగా ఇందిరమ్మ చీరల పంపిణీకి అవసరమైన ప్రాంతాల్లో కేంద్రాలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, మహిళలకు ప్రజా ప్రతినిధులతో ఇందిరమ్మ చీరల పంపిణీకి తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సంతోష్‌నగర్, యాకుత్‌పురా, మలక్‌పేట్, చార్మినార్, మూసారంబాగ్ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్‌లు భాస్కర్‌రెడ్డి, సుభాష్‌రావు, ఇంకేషఫ్‌అలీ, సరిత, మంగతయారు, యూసిడీ పిఓలు రత్నమ్మ, పద్మ, కమ్యూనిటీ కో ఆర్డినేటర్‌లు ప్రసన్నలక్ష్మి, రవి, నరసింహ, అలివేలు, రామకృష్ణ, యాదయ్య, విఆర్‌పీలు నరసింహ, సునీత, రిసోర్స్ పర్సన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి

**నిజాంపేట్, జూన్ 20, ప్రభాతవార్త**


కమిషనర్ సాబేర్ అలీకి వినతిపత్రం అందజేస్తున్న బిజెపి నాయకులు

నిజాంపేట, బండారి లేఔట్ డివిజన్ అధ్యక్షుడు బిక్షపతి యాదవ్ ఆధ్వర్యంలో శనివారం భాజపా నాయకులు నిజాంపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మహమ్మద్ సాబేర్ అలీని కలిసి వివిధ ప్రజా సమస్యలపై చర్చించి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బిక్షపతి యాదవ్ మాట్లాడుతూ డంప్ యార్డ్ సమస్య కారణంగా సంబంధిత కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వేస్ట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను అమలు చేయడం ద్వారా ఈ సమస్యకు పరిష్కారం చూపవచ్చని, ఆ వ్యవస్థను నిజాంపేట సర్కిల్‌లో వెంటనే అమలు చేయాలని కోరారు. అలాగే బండారి లేఔట్ కాలనీలోని అంతర్గత రహదారులు దెబ్బతిన్నాయని, వాటిని వెంటనే మరమ్మతు చేయాలని డిప్యూటీ కమిషనర్‌ను కోరారు. కాలనీ సమీపంలోని తురకచెరువు సుందరీకరణ పనులు నత్తనడకన సాగుతున్నాయని, రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వాటిని వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. పాపయ్యకుంట అభివృద్ధి పనులను కూడా వెంటనే చేపట్టాలని, డ్రైనేజీ తూముల ద్వారా వరదనీరు సక్రమంగా వెళ్లేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నిజాంపేట సర్కిల్ పరిధిలోని వివిధ కాలనీల కమ్యూనిటీ హాల్స్, క్రీడా ప్రాంగణాల కేటాయింపును ఓపెన్ టెండర్ విధానం ద్వారా పారదర్శకంగా చేపట్టాలని, ఇప్పటికే పూర్తయిన టెండర్లను పునఃసమీక్షించి అవసరమైతే తిరిగి టెండర్లకు పిలవాలని వినతిపత్రంలో కోరారు. ఇక కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే కాకుండా చట్టబద్ధతలేని ఓటర్లను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. నిజాంపేట సర్కిల్‌లో డబుల్ ఓట్లు ఉన్న వారి సంఖ్య ఎక్కువగా ఉందని, దాదాపు 109 పోలింగ్ బూత్‌లు ఉన్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నిర్ణయించిన హద్దుల ప్రకారం ఆయా పోలింగ్ బూత్‌ల పరిధిలో నివసించే ఓటర్లు అదే బూత్ పరిధిలో ఉండేలా సమన్వయం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. వినతిపత్రంపై స్పందించిన డిప్యూటీ కమిషనర్ మహమ్మద్ సాబేర్ అలీ, డంప్ యార్డ్ సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపిస్తామని, మిగతా సమస్యలను కూడా సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ సచిన్, సెక్రటరీ సతీష్ కృష్ణ, పాండు, కౌశిక్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## గత 12ఏళ్లుగా నెరవేరని తెలంగాణ ప్రజల ఆకాంక్ష



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న మాజీ ఐఏఎస్ చిరంజీవులు, పాశంయాదగిరి, విజయేందర్‌రెడ్డి తదితరులు

**హైదరాబాద్, జూన్ 20,ప్రభాతవార్త:** తెలంగాణ మేధావులు, ఉద్యమకారులు, విద్యార్థులు తెలంగాణ ప్రజలంతా కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో గత 12 ఏళ్లుగా తెలంగాణ రాజకీయ నాయకులు ప్రజల ఆకాంక్ష నెరవేర్చలేదని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఈమేరకు శనివారం తెలంగాణ హక్కుల సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సీమర్ల విజయేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశానికి మాజీ ఐఏఎస్ చిరంజీవులు, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరితోపాటు వివిధ ఉద్యమ సంఘాల నేతలు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్రము లో 10లక్షల కోట్ల రూపాయలు అప్పు చేశారని వీటి వలన ఏ ఒక్క సామాన్య ప్రజలకు కూడా ఆర్థిక ప్రయోజనం జరగలేదన్నారు. ముందు తెలంగాణ ప్రజలకు అత్యవసరంగా కావలసినవి ప్రతి గ్రామంలో ఇంటర్నేషనల్ స్కూల్స్, ప్రభుత్వ హాస్పిటల్స్, రైతులకు గోదాములు వంటి కట్టడాలు చేయాలనీ డిమాండ్ చేశారు. తెలంగాణంలో నియామకాలు లేక దాదాపు 30 లక్షల మంది యువత నిరుద్యోగంతో బాధపడుతున్నారు. ఈయువతకు ప్రభుత్వ, ప్రవేటు రంగాలలో ఉపాధి కల్పించాల్సిన భాధ్యత ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వంపై ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రము ఏర్పాటు అయ్యాక కెసిఆర్ మొదటి ఎలక్షన్స్‌లో కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజషన్ చేసి ఇకపై కాంట్రాక్టు వ్యవస్థ ఉండకుండా రద్దు చేస్తామన్నారని కానీ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసి కాంట్రాక్టు వ్యవస్థను రద్దుచేయకపోగా 10 సంవత్సరాలుగా కాంట్రాక్టు అవుట్ సోర్స్ వ్యవస్థలను కొనసాగించారన్నారు. ఈ శ్రమ దోపిడీ వ్యవస్థని రద్దు చేసి కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసి మిగిలిన అన్ని ఉద్యోగాలను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్రవేటు రంగ సంస్థలలో తెలంగాణ యువతకు తీరని అన్యాయం జరుగుతుంది. అలాగే ప్రవేటు రంగ సంస్థలకు ప్రభుత్వం అతి తక్కువ ధరలకు భూములను ఇస్తున్నారని వీరంతా తెలంగాణలోని యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పిస్తామని చెప్పి ప్రభుత్వం వద్ద రాయితీలు తీసుకుంటు ప్రవేటు రంగంలో ఇతర రాష్ట్రాల నుండి యువతను తెచ్చి వారికి ఉద్యోగాలు ఇస్తున్నారని దీని వల్ల తెలంగాణ రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ యువతకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు .అంతేకాకుండ తెలంగాణ వనరులు నీరు, విద్యుత్ ఈ పరిశ్రమలు వాడుకుంటున్నాయన్నారు. తెలంగాణ వనరులను త్యాగం చేసి ప్రవేటు సంస్థలకు ఇస్తుంటె వారు మాత్రం తెలంగాణ నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకుండ తెలంగాణ యువతకు తీరని అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఈకార్యక్రమంలో డాక్టర్ ధర్మతేజ, కృష్ణయ్య, పద్మ, ప్రదీప్, కృష్ణ, దుర్గయ్య, రాముడు తదితరులు పాల్గొన్నారు.

## సాంప్రదాయ కళల పరిరక్షణకు సంస్థలు ముందుకు రావాలి



కార్యక్రమంలో పాల్గొన్న మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్

**చిక్కడపల్లి జూన్ 20 ( ప్రభాతవార్త :** భారతీయ సంస్కృతిలో సంగీతానికి విశిష్ట స్థానం ఉందని, సంగీతం ద్వారానే భగవంతుని అనుగ్రహం పొందిన మహనీయులు త్యాగరాజు, భద్రాచల రామదాసు వంటి వారు దేశానికి ఆదర్శమని మల్కాజిగిరి లోకసభసభ్యుడు ఈటెల రాజేందర్ అన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలు, కళలు భారతదేశ ఆత్మను ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. జాతీయ సంగీత కళాకారుల సంఘం ఆధ్వర్యంలో జాతీయ అధ్యక్షులు ఎల్.వి చెన్నారావుచే జరిగింది. ఈటెల రాజేందర్ మాట్లాడుతూ ఆధునికత పేరుతో మన మూలాలను మరచిపోవద్దని, యువత భారతీయ కళా సంపదను తెలుసుకొని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ భారతీయ శాస్త్రీయ సంగీతం, జానపద కళలు మన సంస్కృతికి ప్రతీకలని, ఆధునిక యుగంలో కూడా వాటి ప్రాముఖ్యత ఏమాత్రం తగ్గలేదన్నారు. యువత సాంకేతిక పరిజ్ఞానంతో పాటు భారతీయ విలువలు, సంప్రదాయ కళలను కూడా నేర్చుకోవాలని సూచించారు. కళాకారులు సమాజానికి సాంస్కృతిక వారధులుగా నిలుస్తారని, వారి కృషి వల్లే భారతీయ కళా వైభవం తరతరాలకు చేరుతోందని కొనియాడారు. సంస్కార భారతి గ్రేటర్ అధ్యక్షుడు శ్రీనివాస్ భోగి రెడ్డి , సీనియర్ బీజేపీ నేత, బ్యాంకింగ్ రంగ నిపుణుడు సుధాకర్ గందె, సంఘం ప్రతినిధులు జిల్లెల రవి యాదవ్, వేముల శ్రీనివాస్ రావు, మారం శ్రీనివాస్ రెడ్డి, ఎస్.మనోజ్, సీనియర్ హార్మోనిస్టు అబ్బూరి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంగీత విద్వాంసులు డివి మోహనకృష్ణ నిర్వహించిన కర్ణాటక శాస్త్రీయ సంగీత కచేరి, ప్రముఖ సంగీత విద్వాంసులు ద్వారం సత్యనారాయణ సంగీత కచేరి, ప్రముఖ సంగీత కళాకారిణి కె.లహరి నిర్వహించిన సంగీత సాగరంలో తేలియాడించింది. 150 మంది కళాకారులు ఆలపించిన శాస్త్రీయ, లలిత, జానపద, దేశభక్తి గీతాలు, వీణవాద్యకళాకారిని గీత , నాదస్వర కళాకారులు రాఘవేంద్ర, దుర్గాప్రసాద్, డోలు విద్వాన్ లు శ్రీరాములు, కిరణ్ కుమార్, గాయని గాయకులు సుజా రమణ తదితరులు సంగీత కార్యక్రమం మంత్రముగ్దులను చేసింది.

## ఇందిరా మహిళా శక్తి చీరెల పంపిణీ


చీరలు పంపిణీ చేస్తున్న వి.హనుమంతరావు

**హైదరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారులు వి.హనుమంతరావు ఆధ్వర్యంలో అంబర్‌పేట్‌లోని రామకృష్ణనగర్ పార్క్‌లో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. శనివారం ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంకు ముఖ్య అతిథిగా ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షులు మోతా రోహిత్, డీఎంఒ రజిత హాజరై చీరల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ మహిళలే మహరాణులని, మహిళలు ప్రతి పనిని ఎంతో ఏకాగ్రతతో, నిబద్ధతతో నిర్వహిస్తారని కొనియాడారు. మోతా రోహిత్ మాట్లాడుతూ ద్వారా మహిళా గ్రూప్‌ల ద్వారా మహిళా సాధికారత జరుగుతుందని తెలిపారు. శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేసే దిశగా మన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పిసీసీ కార్యదర్శులు శంభుల శ్రీకాంత్‌గౌడ్, ఈడెల్లి ప్రభాకర్, కోటం అనిల్, రావుల సుధాకర్, ఓం ప్రకాష్ పాల్గొన్నారు.

## నేత్రపర్వంగా అర్ధనారీశ్వరం జాతీయ నృత్యోత్సవాలు

### -రాష్ట్ర సంగీత నాటక అకాడమీ అధ్యక్షురాలు ఆచార్య అలేఖ్య పుంజాల

**రవీంద్రభారతి, జూన్ 20 ప్రభాతవార్త :** ప్రజాప్రభుత్వ 100 రోజుల ప్రజాపాలన ఉత్సవాల్లో భాగంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో కనీవినీ ఎరుగనిరీతిలో నేత్రపర్వంగా అర్ధనారీశ్వరం శీర్షికన ప్రతిష్టాత్మకంగా జాతీయస్థాయి నృత్యోత్సవాల నిర్వహణకు సన్నాహాలు పూర్తిచేసినట్లు అకాడమీ అధ్యక్షురాలు ఆచార్య ఆలేఖ్య పుంజాల తెలిపారు. ఈమేరకు శనివారం మధ్యాహ్నం రవీంద్రభారతి ప్రాంగణంలోని కళాభవన్‌లో అకాడమీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రకటించారు. జూన్ 22 నుండి 3రోజులపాటు రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ప్రతీరోజు సాయంత్రం 5గంటల నుంచి ఈ జాతీయ నృత్యోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన యువ, సీనియర్ కళాకారులు సమ్మిళితంగా ప్రదర్శనలిచ్చే విధంగా ఉత్సవాలను రూపొందించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా 3రోజుల అర్ధనారీశ్వరం జాతీయ నృత్యోత్సవ వివరాలకు సంబంధించిన బ్రోచర్‌ను అలేఖ్య ఆవిష్కరించి వివరాలను వెల్లడించారు. 22 సోమవారం ఉత్సవాలను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కచ రాష్ట్ర సాంస్కృతిక పర్యాటకశాఖల మంత్రి జూపల్లి కృష్ణారావులు ముఖ్యఅతిథులుగా పాల్గొని లాంఛనంగా ప్రారంభిస్తారని ప్రకటించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా కేంద్ర సంగీత నాటక అకాడమీ తాజాగా ప్రకటించిన ప్రతిష్టాత్మక అవార్డుల తెలంగాణకు చెందిన విజేతలను ఘనంగా సత్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఇక జాతీయ నృత్యోత్సవంలో మొదటిరోజు హైదరాబబాద్ యువ కళాకారులు సురేంద్రనాథ్ బిజినా దంపతులు ద్వయం కూచిపూడి నృత్యంతో ప్రారంభమై న్యూఢిల్లీ కళాకారులు వసీమ్‌రాజు సమర్పణలో; హైదరాబాద్ కళాకారులు ఆయానా మనోజ్ఞ బాలరాజు బృందం అధర్వ ప్రదర్శిస్తారని డా. అలేఖ్య పుంజాల తెలిపారు. రెండవరోజు 23న ముంబయి కళాకారులు పవిత్ర భట్, అపర్ణశాస్త్రి ఏకమ్ దేవయామ్, బెంగళూరుకు చెందిన డా. వసంత్‌కిరణ్ సభాపతి, హైదరాబాద్‌కు చెందిన వైష్ణవి సాయినాథ్ నృత్యకదంబం భరతనాట్య ప్రదర్శనలు జరుగుతాయని చెప్పారు. మూడవరోజు 24న ముగింపు ఉత్సవాల్లో పద్మశ్రీ అవార్డు గ్రహీత దీపికారెడ్డి, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జ్ ఉపాధ్యక్షుడు ఆచార్య డా. అనూరాధ జొన్నలగడ్డ పాల్గొంటారని, బెంగళూరు కళాకారులు నిధగా కరుణాళ్, రచనా కరణిక్ జంట ఏకత్వం ప్రదర్శిస్తారని చెప్పారు. తదుపరి బెంగళూరు కళాకారులు సూర్యా ఎన్.రావు బృందం రావణ, న్యూ ఢిల్లీ నకళాకారిణి యామినిరెడ్డి కూచిపూడి శైలిలో ఇషాణి ప్రదర్శనలుంటాయని అలేఖ్య వివరించారు. మూడురోజుల ఆయా ప్రదర్శనల గురించి విద్యార్థులతు సమీక్షా వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు తగిన బహుమతులిచ్చి ప్రోత్సహించనున్నట్లు అకాడ మీ అధ్యక్షురాలు ఆచార్య అలేఖ్య పుంజాల పేర్కొన్నారు.

## బోనాల ఉత్సవాలకు ఇబ్బందులు లేకుండా చూడాలి

### -సమీక్ష సమావేశంలో జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి




**అత్తాపూర్ జూన్ 20,ప్రభాతవార్త :** బోనాల ఉత్సవాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్నీ విభాగల అధికారులు సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లు చేయాలని జీ హెచ్ యం సి రాజేంద్రనగర్ జోన్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రానున్న బోనాల ఉత్సవాలను పురస్కరించుకొన్ని రాజేంద్రనగర్ లోని జోనల్ కార్యాలయంలో శనివారం జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి, పాతబస్తీ భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షులు మధుసూదన్ యాదవ్, కమిటీ ప్రతి నిధులు , జంగమ్మెట్, చాంద్రాయణగుట్ట, బహదూర్ పురా, ఫలక్ నుమా సర్కిళ్ల పరిధిలోని పలు విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... పాతబస్తిలో వైభవంగా నిర్వహించే ఆషాడ మాసం బోనాల ఉత్సవాల సందర్భంగా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బోనాల పండగ కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తమ పరిధిలోని అన్నీ ఏర్పాట్లు చేస్తున్నమన్నారు. త్వరలో క్షేత్రస్థాయిలో ఆలయ పరిసర ప్రాంతాల్లో పర్యటించి చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రధాన ఆలయాలు, బోనాలు సమర్పించే దేవాలయాల వద్ద ప్యాచ్ వర్క్ , వీధి దీపాలకు మరమ్మతులు నిర్వహించనున్నమన్నారు. ఘట్టా ల ఊరేగింపు కొనసాగే ప్రాంతాల్లో భక్తులకు ఇబ్బందులు రాకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలనీ ఆదేశించారు. డ్రైనేజీ, పారిశుధ్య సమస్యలు తేలేత్తకుండా ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో చాంద్రాయణగుట్ట, జంగమ్మెట్, ఫలక్ నుమా, బహదూర్ పురా సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు సురేందర్, పాపయ్య, మహమ్మద్ ఇష్ఫాక్, అరుణ కుమారి, ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ నరేందర్ గౌడ్, ఈబిడి యూ బి డి డిప్యూటీ డైరెక్టర్ విష్ణువర్ధన్, ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ , పారిశుధ్యం, విభాగం, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## ముందుగా గుర్తిస్తే వినికిడి లోపానికి చెక్

### కోక్లియర్ ఇంప్లాంట్ సదస్సులో వక్తలు


సదస్సులో పాల్గొన్న ప్రతినిధులు

**హైదరాబాద్, జూన్ 20,ప్రభాతవార్త:**

"వినికిడి లోపమున్న చిన్నారుల్లో ముందస్తు గుర్తింపు, సకాలంలో చికిత్సతో జీవితాలను మార్చవచ్చని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్ వ్యవస్థాపకులు జి.సునీత కుమార్ తెలిపారు. మాట్లాడే సామర్థ్యాన్ని పెంపొందించి, వారి సమగ్ర అభివృద్ధికి తోడ్పడే విధానాలపై నిపుణులు మేధోమథనం చేశారని పేర్కొన్నారు. కోక్లియర్ ఇంప్లాంట్ రంగంలోని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రస్తుత సవాళ్లు, భవిష్యత్తు కార్యాచరణపై ఈ సదస్సులో విస్తృతంగా చర్చించినట్లు ఆమె పేర్కొన్నారు. "మా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్, మా ఈఎన్‌టీ సంయుక్త ఆధ్వర్యంలో, అలీ యావర్ జంగ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో జూన్ 20, 21 తేదీల్లో రెండురోజులపాటు నిర్వహిస్తున్న సదస్సు శనివారం ప్రారంభమైంది. "ఫ్రమ్ సైన్స్ టూ క్లినికల్ ప్రాక్టీస్" అనే థీమ్‌తో నిర్వహిస్తున్న ఈ సదస్సుకు ముంబై నుంచి డాక్టర్ సుమన్ కుమార్, మణిపాల్ యూనివర్సిటీ మాజీ డీన్ ప్రొఫెసర్ రాజశేఖర్, రోటరీ డిస్ట్రిక్ట్ 3150 మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్లు రవి వడ్లమాని, రమేష్ వంగల, రోటరీ క్లబ్ ఆఫ్ లేక్ డిస్ట్రిక్ట్ మొయినాబాద్ సెక్రటరీ రోటేరియన్ శివాని త్రివేవాలా తదితర ప్రముఖులు పాల్గొన్నారు. సమగ్ర పునరావాస సేవలు, ఆడిటరీ వెర్బల్ థెరపీ ద్వారా ఎందరో చిన్నారులు వినికిడి లోపాన్ని అధిగమించి, ప్రస్తుతం కార్పొరేట్ ఉద్యోగులుగా, ఇంజినీర్లుగా స్థిరపడ్డారని సునీత కుమార్ తెలిపారు. ముందస్తు గుర్తింపు, సకాలంలో చికిత్సతో జీవితాలను మార్చవచ్చని ఆమె పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 150 మంది నిపుణులు, ఆడియాలజిస్టులు, పరిశోధకులు, విద్యార్థులు ఈ సదస్సులో పాల్గొంటున్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో కోక్లియర్ ఇంప్లాంట్ అర్హత ప్రమాణాలు, శస్త్రచికిత్స విధానాలు, మ్యాపింగ్, తాజా సాంకేతిక పురోగతులపై నిపుణుల ఉపన్యాసాలు, ప్యానెల్ చర్చలు జరగనున్నాయి.

### భారీగా బంగారు ఆభరణాలతో ఉడాయింపు

**జూబ్లీహిల్స్, జూన్ 20, ప్రభాతవార్త:**

భారీగా బంగారం తీసుకొని ఉడాయించిన ఇద్దరు బంగారు దుకాణ యజమానులతోపాటు ఇద్దరు ఉద్యోగులపై పంజాగుట్ట ఠాణాలో కేసు నమోదైంది. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. కృష్ణమ్ జువెలర్స్ అండ్ మాధవ రాఘవ ఎల్ఎల్‌పీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న సన్నీవర్మకు కేవీ జువెలర్స్, నితిన్ జువెలర్స్, నితిన్ ఎంటర్‌ప్రైజెస్ యజమాని నితిన్ రమేష్ గుల్బానీ, భాగస్వామి విపిన్ రమేష్ గుల్బానీ, అకౌంట్స్ మేనేజర్ ధనరాజ్ సింగ్, సేల్స్ ఇంఛార్జి హరీష్‌లతో దాదాపు 20 ఏళ్ల పరిచయం ఉంది. ఈ క్రమంలోనే వారి మాటలను నమ్మి వ్యాపారం, విక్రయం కోసం వివిధ సందర్భాలలో బంగారు కుందన్ ఆభరణాలను వారికి సరఫరా చేశారు. గతేడాది డిసెంబరులో 22 క్యారెట్లతో కూడిన దాదాపు 1503 గ్రాములు, ఈ ఏడాది ఫిబ్రవరిలో 2658 గ్రాముల కుందన్‌లను వారికి అందజేశారు. ఇందుకు సంబంధించిన రశీదులు, బిల్లులు, సమాచారమార్పిడి మొత్తం విపిన్ గుల్బానీ, ధనరాజ్ సింగ్, హరీష్‌ల ద్వారా నిర్వహించారు. ఇచ్చిన బంగారానికిగాను తొలుత కొంతమొత్తంలో డబ్బులు చెల్లించిన్నటికి పెద్దమొత్తంలో మిగిలిన డబ్బులు చెల్లించాల్సి ఉంది. డబ్బులు చెల్లించకుండా, ఆభరణాలు తిరిగి ఇవ్వకుండా కాలయాపన చేస్తూ వచ్చారు. దీంతో ఈ నెల 18న కార్యాలయానికి వెళ్లగా కార్యాలయానికి తాళం వేసి ఉండటంతోపాటు నలుగురి సెల్‌ఫోన్లు అందుబాటులో లేకుండా పోయాయి. దీంతో విచారించగా మరింతమందిని మోసం చేసినట్లు గుర్తించి పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు నితిన్ రమేష్ గులాబాని, విపిన్ రమేష్ గులాబాని, ధనరాజ్ సింగ్, హరీష్‌లపై 316(2), 318(4)తో పాటు 3(5) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఖైరతాబాద్‌లో లారీ చక్రాల కింద తెల్లారిన యువకుడి జీవితం

**జూబ్లీహిల్స్, జూన్ 18, ప్రభాతవార్త:**

రాపిడో బైక్‌పై పిలియన్ రైడర్‌గా వెళ్తున్న ఓ యువకుడు లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఖైరతాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అబిడ్స్‌లోని తిలక్‌నగర్ రోడ్డులో నివాసముంటున్న వ్యాపారి ప్రదీప్ కుమార్ సంతదాసాని కుమారుడు అనిరుధ్ సంతదాసాని (28) శుక్రవారం రాత్రి స్నేహితుడి నిశ్చితార్థ వేడుకకు బంజారాహిల్స్‌కు వెళ్లాడు. అనంతరం శనివారం తెల్లవారుజామున సుమారు 1.50 గంటల సమయంలో రాపిడో బైక్‌పై ఇంటికి తిరిగి వస్తుండగా, ఖైరతాబాద్‌లోని వి.వి. స్టాచ్యూ సిగ్నల్ వద్ద ఈ ప్రమాదం జరిగింది. సిగ్నల్ వద్ద ఆగి ఉన్న అశోక్ లేలాండ్ లారీకి గ్రీన్ సిగ్నల్ పడడంతో లారీ, రాపిడో బైక్ ఒకేసారి ముందుకు కదిలాయి. ఈ క్రమంలో లారీ డ్రైవర్ ఫరూక్ అలీ మహమ్మద్ నిర్లక్ష్యంగా, అతివేగంగా వాహనాన్ని నడపడంతో లారీ వెనుక భాగం రాపిడో బైక్‌ను ఢీకొట్టింది. దీంతో పిలియన్ రైడర్‌గా ఉన్న అనిరుధ్ రోడ్డుపై పడిపోగా, లారీ వెనుక చక్రం అతనిపై నుంచి వెళ్లింది. ఈ ప్రమాదంలో అనిరుధ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సికింద్రాబాద్ లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఖైరతాబాద్ పోలీసులు ప్రమాదానికి కారణమైన లారీని స్వాధీనం చేసుకుని, డ్రైవర్ ఫరూక్ అలీ మహమ్మద్‌ను అరెస్టు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

### జూబ్లీహిల్స్‌లో ఎస్‌కేటీ జ్యువెలర్స్‌లో బంగారం చోరీ..

**జూబ్లీహిల్స్, జూన్ 18, ప్రభాతవార్త:**

జూబ్లీహిల్స్‌లోని ఎస్‌కేటీ జ్యువెలర్స్‌లో జరిగిన బంగారు ఆభరణాల చోరీ కేసును జూబ్లీహిల్స్ క్రైమ్ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో సంస్థలో పనిచేస్తున్న ముగ్గురు ఉద్యోగులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి కొంత బంగారు ఆభరణాన్ని స్వాధీనం చేసుకున్నారు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. రోడ్ నెం.36లో ఉన్న ఎస్‌కేటీ జ్యువెలర్స్‌లో గత మార్చి 25న నిర్వహించిన స్టాక్ వెరిఫికేషన్‌లో రిపేర్ విభాగంలో భద్రపరిచిన సుమారు 8.2 గ్రాముల బంగారు ఆభరణాలు కనిపించకుండా పోయినట్లు గుర్తించారు. అనంతరం జూన్ 10న ఓ కస్టమర్‌కు చెందిన నమూనా బంగారు గొలుసుతో పాటు ఇతర బంగారు ఆభరణాలు కలిపి 30.14 గ్రాముల బంగారం కూడా కనిపించకుండా పోయినట్లు తేలింది. సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించగా కొందరు ఉద్యోగుల కదలికలు అనుమానాస్పదంగా ఉన్నట్లు గుర్తించారు. అలాగే 2025 జూలై నెలలో షోరూమ్ నుంచి 38.020 గ్రాముల బంగారు గొలుసు కూడా మాయమైనట్లు గుర్తించడంతో షోరూమ్ యజమాని దోసపాటి కార్తీక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో భాగంగా స్టోర్ ఉద్యోగులైన భూక్య శివకుమార్, వడ్డారం ప్రకాష్, పాత్రి గోవర్ధన్ ఈ చోరీలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడు శివకుమార్ వద్ద నుంచి సుమారు 5.28 గ్రాముల బంగారు ఉంగరాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మొత్తం 76.385 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు పోలీసులు తెలిపారు. చోరీ చేసిన బంగారంలో కొంత భాగాన్ని ఆదిత్య హాల్‌మార్కింగ్ సెంటర్ ద్వారా, మరికొంతను వరంగల్ ప్రాంతంలోని బంగారం వ్యాపారులకు విక్రయించినట్లు నిందితులు విచారణలో అంగీకరించినట్లు వెల్లడించారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జూబ్లీహిల్స్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు.

### ఫలక్‌నుమాలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

**చాంద్రాయణగుట్ట, జూన్ 20, ప్రభాతవార్త :** ఫలక్‌నుమా పోలీసుస్టేషన్ పరిధిలో వివిధ సందర్భాలలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు ఆ డివిజన్ ఏసీపీ ఎం.ఎ.జావీద్, ఇన్‌స్పెక్టర్ ఈ.జంగయ్య తిరిగి వాటిని అప్పగించారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ షేక్ జాకీర్ హుస్సేన్, క్రైమ్ బృందం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి 20 సెల్‌ఫోన్లను వెతికి పట్టారు. వాటిని పోగొట్టుకున్న బాధితులకు సమాచారం అందించి స్టేషన్లో నిర్వహించిన కార్యక్రమంలో అప్పగించారు. వీటి విలువ సుమారు రూ.లక్షా 95 వేలుంటుందని ఇన్‌స్పెక్టర్ యాదయ్య పేర్కొన్నారు. సెల్‌ఫోన్లు పొందిన వారు సంతోషం వ్యక్తం చేశారు. పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు. సెల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు తగిన ఆధారాలతో పోలీ సులకు ఫిర్యాదు చేస్తే వాటిని కనుగొని అప్పగిస్తామని ఏసీపీ జావీద్ పేర్కొన్నారు.

## వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి : ఏసిపి చంద్రకుమార్



డ్రైవర్లకు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఏసిపి చంద్రకుమార్, చిత్రంలో ఇన్‌స్పెక్టర్ భాస్కర్ తదితరులు

**మలక్ పేట, జూన్ 20, ప్రభాతవార్త:**
వాహనదారులు ట్రాఫిక్ నియమ, నిబంధనలను పాటించాలని ట్రాఫిక్ ఏసిపి చంద్రకుమార్ పేర్కొన్నారు. మలక్ పేట్ ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ భాస్కర్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ పరిధిలోని గడ్డిఅన్నారం, శాలివాహన నగర్ తదితర ప్రాంతాలలో స్పెషల్ డ్రైవ్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసిపి చంద్రకుమార్, ఇన్ స్పెక్టర్ భాస్కర్ లు సిబ్బందితో కలిసి విద్యా సంస్థలకు చెందిన బస్సు డ్రైవర్లకు బ్రీత్ అనలైజర్ పరీక్షలను నిర్వహించారు. నిబంధనలను అతిక్రమించిన వారి పై కేసులు నమోదు చేయడం జరిగిందని ఏసిపి చంద్రకుమార్, ఇన్ స్పెక్టర్ భాస్కర్ లు పేర్కొన్నారు. ట్రాఫిక్ నియమ, నిబంధనలను పాటిస్తూ పాఠశాల విద్యార్థులను సురక్షితంగా వారి గమ్య స్థానాలకు తీసుకువెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎస్ఐ లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి దేవాలయాలకు మరమ్మతు పనులు చేపట్టాలి



జోనల్ కమిషనర్ సత్యనారాయణకు వినతిపత్రం సమర్పిస్తున్న పగిళ్ల నర్సింగ్, పిటి శంకర్ ముదిరాజ్ తదితరులు

**మలక్ పేట, జూన్ 20, ప్రభాతవార్త:**
రానున్న బోనాల పండుగను పురస్కరించుకుని మలక్ పేటలో అమ్మవారి దేవాలయాలకు మరమ్మతు పనులు చేపట్టాలని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పగిల్ల నర్సింగ్, స్థానిక సంక్షేమ సంఘం నాయకులు పిటి శంకర్ ముదిరాజ్ లు పేర్కొన్నారు. బోనాల పండుగను పురస్కరించుకుని మలక్ పేట్ లోని అమ్మవారి దేవాలయాలకు మరమ్మతు పనులు చేపట్టాలని జోనల్ కమిషన్ సత్యనారాయణకు వారు వినతి పత్రాన్ని సమర్పించారు. జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించి తగిన చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ స్వాధీనం



కల్తీ అల్లం వెల్లుల్లి పేస్టులను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

**మలక్ పేట, జూన్ 20, ప్రభాతవార్త:**
కల్తీ అల్లం, వెల్లుల్లి తయారీ కేంద్రంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు, మలక్ పేట పోలీసులు సంయుక్తంగా దాడి చేసి కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్టులను స్వాధీనం చేసుకున్న సంఘటన మలక్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ఓల్డ్ మలక్ పేట్ వాహీద్ నగర్‌లో కల్తీ అల్లం వెల్లుల్లి పేస్టులను తయారు చేస్తున్నారనీ సమాచారం అందడంతో టాస్క్ ఫోర్స్ ఎస్సై మధు, మలక్ పేట ఎస్ఐ తేజ్యా నాయక్‌లు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి నిర్వాహకుడు ఫారుక్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## వరద నీటి సమస్యను పరిష్కరించాలి



కాలనీవాసులతో మాట్లాడుతున్న ఉపేందర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, జూన్ 20 ప్రభాతవార్త:**
వర్షాకాలన్నీ దృష్టిలో పెట్టుకొని వరదనీటి సమస్యను పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నా రు. ఆర్కేపురం డివిజన్ పరిధి హరిపురికాలనీ సంక్షేమ సంఘం, సరూ ర్‌నగర్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, అధికారులతో కలిసి వరదనీటి సమస్యకు సంబంధించి శనివారం కాలనీలో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే వర్షాకాలన్నీ దృష్టిలో పెట్టుకొని వరదనీటి నివారణకై తగు చర్యలను తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. అధికారులు సమస్య తీవ్రతను తెలుసుకొని త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హరిపురికాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు పెద్ది శ్రీనివాస్, కృష్ణమూర్తి, ప్రభాకర్‌రెడ్డి, రాజేంద్రప్ర సాద్, సత్తిరెడ్డి, చంద్రశేఖర్, కాంగ్రెస్ నాయకులు మామిడి రామకృష్ణగౌడ్, పెద్దవూర సైదులు, వెంకట రమణరెడ్డి, అశోక్, రఘువర్ధన్‌రెడ్డి, విప్లవ్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

## చదువు పట్ల ఆసక్తిని పెంచుకోవాలి



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న మహేష్‌యాదవ్

**ఎల్.బి.నగర్, జూన్ 20 ప్రభాతవార్త:** విద్యార్థులు చదువు పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని చైతన్యపురి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తోట మహేష్‌యాదవ్ పేర్కొన్నారు. తోట మహేష్‌యాదవ్ అధ్వర్యంలో చైతన్యపురి డివిజన్ న్యూమారుతినగర్‌లో నివాసం ఉంటున్న పాపయ్య మనమడు, మనమరాలు వర్షిణి, యశ్వంత్ పదవ తరగతి చదువుతుండగా వారికి అవసరమైన పుస్తకాలను శనివారం మహేష్‌యాదవ్ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక రఘునాథ మోడల్ స్కూల్లో చదువుకోవడానికి ఫీజులో రాయితీ కల్పించే విధంగా ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నదా శిఖరాలను అధిరోహించాలని అన్నారు.

## వర్షాకాలంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలి

**నిర్లక్ష్య ధోరణి వీడకుంటే సహించబోను : ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి**



**తుర్కయంజాల్, జూన్ 20 ,ప్రభాతవార్త**
ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సూచించారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే అధికార యంత్రాంగం ప్రధాన లక్ష్యంగా ఉండాలని పేర్కొంటూ, విధి నిర్వహణలో నిరక్ష్య ధోరణి కొనసాగితే సహించబోమని హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం తొర్రూర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో జీహెచ్ఎంసీ పరిధిలోని ఆదిబట్ల సర్కిల్‌కు చెందిన తుర్కయంజాల్, ఆదిబట్ల మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. రాత్రి వరకు సాగిన ఈ సమావేశంలో పారిశుద్ధం, తాగునీటి సరఫరా, విద్యుత్, రోడ్ల నిర్మాణాలు, ప్రజారోగ్యం, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కాలనీల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఇంటింటా చెత్త సేకరణ, డ్రైనేజీల నిర్వహణ, చెత్త డంపింగ్ వంటి కార్యక్రమాలను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహించడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రజారోగ్యం అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని పేర్కొన్న ఎమ్మెల్యే, డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించిన మల్‌రెడ్డి రంగారెడ్డి, కొత్త రోడ్ల నిర్మాణం, మరమ్మతు పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. తాగునీటి సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడటంతో పాటు పైప్‌లైన్ లీకేజీలను వెంటనే సరిచేయాలని సూచించారు. అదే విధంగా పార్కుల అభివృద్ధి, పచ్చదనం పెంపు కార్యక్రమాలను వేగవంతం చేయాలని అన్నారు. సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీసిన ఎమ్మెల్యే, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు కృషి చేయాలని కోరారు. అభివృద్ధి పనులకు అవసరమైన నిధుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో జోనల్ డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి, వార్డు అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రెవెన్యూ అధికారులపై దాడిని ఖండిస్తూ జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో నిరసన



**తుర్కయంజాల్, జూన్ 20, ప్రభాతవార్త**
తుర్కయంజాల్‌లో విధి నిర్వహణలో ఉన్న రెవెన్యూ అధికారులపై ఇటీవల జరిగిన దాడి ఘటనను ఖండిస్తూ ఆదిభట్ల సర్కిల్15 పరిధిలోని రాగన్నగూడ జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో శనివారం అధికారులు, ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వ ఉద్యోగుల భద్రతకు విఘాతం కలిగించే చర్యలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొంటూ ఉద్యోగులు బ్లాక్ బ్యాడ్జీలు ధరించి నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, భూ వివాదానికి సంబంధించి విధి నిర్వహణ కోసం వెళ్లిన రెవెన్యూ అధికారులపై దాడి జరగడం అత్యంత బాధాకరమైన ఘటన అని అన్నారు. ప్రభుత్వ విధులను నిర్వర్తిస్తున్న అధికారులపై దాడులు చేయడం, విధి నిర్వహణకు ఆటంకం కలిగించడం చట్టవిరుద్ధ చర్య మాత్రమే కాకుండా ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు సేవలందించేందుకు నిరంతరం కృషి చేస్తుంటారని, అలాంటి ఉద్యోగులపై దాడులు జరగడం సమాజానికి మంచిది కాదని ఆయన అన్నారు. విధి నిర్వహణలో ఉన్న అధికారులు, ఉద్యోగులు ఎలాంటి భయాందోళనలు లేకుండా తమ బాధ్యతలు నిర్వర్తించేలా ప్రభుత్వం, పోలీసు శాఖలు తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని కోరారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసిన ఆయన, ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు, బెదిరింపులు, విధి నిర్వహణకు ఆటంకం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, పోలీసు శాఖలు సమన్వయంతో వ్యవహరించి కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బిక్షపతి, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్లు, వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు, సిస్టమ్ ఆపరేటర్లు, ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొని రెవెన్యూ అధికారులకు సంఘీభావం ప్రకటించారు.

## మోడీ పాలనలో దేశాభివృద్ధి : మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్




హబ్సిగూడలో జరిగిన మేధావుల సదస్సులో ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్, చిత్రంలో బేతి సుభాష్‌రెడ్డి తదితరులు

**రామంతాపూర్, జూన్ 20 ప్రభాతవార్త :** ప్రధాని మోడీ సుపరిపాలనలో దేశాభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం హబ్సిగూడ జెఎస్ఎన్‌కాలనీ కమ్యూనిటిహాల్‌లో జరిగిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ చేతన, అడ్వకేట్ అనురాధ రెడ్డి, ప్రొఫెసర్ రమాకాంత్ రెడ్డి, లెక్చరర్ ఎంఎం గౌడ్, సిఎ అశోక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, బేతి సుభాష్‌రెడ్డిలు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ దూరదృష్టి నాయకత్వంలో భారత్ ప్రపంచ వేదికపై మరింత బలమైన స్థానాన్ని సంపాదించిందని పేర్కొన్నారు. దేశ అభివృద్ధి, మౌళిక వసతుల విస్తరణ, సంక్షేమ పదజకాలు, డిజిటల్ విప్లవం, జాతీయ భద్రత, ఆర్థిక సంస్కరణలు తదితర అంశాలపై స్వచ్ఛభారత్ స్కిల్ ఇండియా మేక్ ఇండియా, ఆపరేషన్ సింధూర్, కార్గిల్ యుద్ధం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. వికసిత భారత్ లక్ష్య సాధనలో ప్రజల భాగస్వామ్యం కీలకమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ వేములకొండ సోమశేఖర్‌గౌడ్, కో కన్వీనర్లు చింతకింది ప్రవీణ్, ఆర్.వి.శేఖర్, జి. రవీందర్ రెడ్డి, సంజయ్ పటేల్, బండి పద్మ, బొమ్మ గౌని రఘుపతి గౌడ్ నేతలు కొండేరు స్రవంతి, సాదినేని గీత, వెంకన్న గౌడ్, బానోతు రమేష్ నాయక్, కట్టా భాస్కర్, అలకాపురి సురేష్, రంగ రవి, హేమంత్ మూలే, కనావత్ రాజు నాయక్, శాంతి కుమార్, పూల కృష్ణ, కాలనీ నేతలు ఆనం రాఘవరెడ్డి, యాదవరెడ్డి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తి పన్నులు, బకాయిలు సకాలంలో చెల్లించాలి : జోనల్ కమీషనర్ చంద్రకళ



శంషాబాద్ జడ్‌సి చంద్రకళ

**సరూర్‌నగర్, జూన్ 20 ప్రభాతవార్త:**
జిహెచ్ఎంసి శంషాబాద్ జోన్ పరిధి కిందకు వచ్చే బడంగ్‌పేట్, జల్‌పల్లి, ఆదిభట్ల, శంషాబాద్ సర్కిళ్ళకు సంబంధించిన ఆస్తి పన్ను చెల్లింపుదారులు తమ ఆస్తి పన్నులు, బకాయిలను నిర్ణీత గడువులోగా చెల్లించి అదనపు వడ్డీ భారం పడకుండా చూసుకోవాలని జోనల్ కమీషనర్ చంద్రకళ కోరారు. ఈ మేరకు ఆమె జిహెచ్ఎంసి కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ తరపున ఒక ప్రకటన విడుదల చేశారు. తమ తమ ప్రాంతాల్లోని రహదారులు, వీధి దీపాలు, పారిశుధ్యం, మురుగు నీటి నిర్వహణ వ్యవస్థ, పార్కులు, ప్రజారోగ్య సేవలు, ఇతర మౌళిక సదుపాయాల కల్పనకు ఆస్తి పన్ను చెల్లింపుల వల్ల వచ్చే ఆదాయం ద్వారా వినియోగించడం జరుగుతుందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ప్రస్తుత ఆస్తి పన్ను, ఏమైనా బకాయిలు ఉన్న పక్షంలో వాటిని గడువు లోగా చెల్లించాలని ఆమె కోరారు. దీని వల్ల అదనపు వడ్డీ భారం నుండి వెసులువాటు కలుగుతుందని ఆమె వెల్లడించారు. జిహెచ్ఎంసి చట్టం ప్రకారం మొదటి అర్థ సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్నును ఏప్రిల్ 1 నుండి, రెండవ అర్థ సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్నును అక్టోబర్ 1 నుండి చెల్లించాల్సి వస్తుందని ఆమె వివరించారు. మొదటి ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్నును జూన్ 30 లోగా చెల్లిస్తే వడ్డీ ఉండదనీ లేని పక్షంలో జూలై 1 నుండి ప్రస్తుత పన్నుపై నెలకు 2 శాతం చొప్పున వడ్డీ విధించబడుతుందని ఆమె పేర్కొన్నారు. బకాయిలపై కూడా నెలకు 2 శాతం సాధారణ వడ్డీ విధించబడుతుందని అన్నారు. ఈ నేపథ్యంలో ఆస్తి పన్ను చెల్లింపులపై అవగాహన చేసుకొని సకాలంలో పన్నులు చెల్లించి వడ్డీల నుండి వెసులుబాటు చేసుకోవాలని జడ్‌సి సూచించారు.

## రామంతాపూర్ గోశాల అక్రమాలపై పరస్పర ఆరోపణలు

### -పిఎస్‌కు చేరిన పంచాయితీ ..
### గోశాల నిధులు స్వాహా



రామంతాపూర్ చిన్న చెరువు పాండురంగ ఆలయం వద్ద ఉన్న గోశాల దృశ్యం.

**రామంతాపూర్, జూన్ 20 ప్రభాతవార్త :** రామంతాపూర్ గోశాల నిర్వహణ విషయంలో నిర్వహకుల మధ్య పరస్పర ఆరోపణలతో మరోసారి వివాదం నెలకొంది. రామంతాపూర్ చిన్న చెరువు వద్ద కొద్ది సంవత్సరాల క్రితం పాండురంగ సేవా సమితి గోశాల నిర్వహిస్తున్నారు. ఇందులో గోవులతోపాటు, ఎద్దులు, చిన్న దూడలు సుమారు 50 వరకు ఉన్నాయి. అయితే వీటి నిర్వహణ కోసం గతంలో ఒక కమిటి వేసుకుని చూసుకునే వారు. కాగా గోశాల నిర్వాహకుల మధ్య విబేదాలు రావడంతో గోశాల మధ్య గోడవలకు దిగుతున్నారు. ఎవరికి తోచిన విధంగా వారు గోవులను తరలించుకుని వెళ్లడం, ఇతరులకు ఇవ్వడం చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కాగా గోశాలలో ఉన్న అక్రమాలు జరుగుతున్నాయని, గత 2011 వ సంవత్సరం లో ఏర్పాటు చేసిన గోశాలలో ఆవులు, ఎద్దులు కలిపి మొత్తం 48 ఉండగా, వెంకట్ రెడ్డి అనే వ్యక్తి నాలుగు, దీపక్ కంజారియా మూడు, ప్రవీణ్, మురళీలు రెండేసి చొప్పున మొత్తం 11 ఎద్దులను ఎవరి అనుమతి లేకుండా అక్రమంగా తరలించుకు వెళ్లారని సమితి ప్రధాన కార్యదర్శి తాళ్ళ బాలకృష్ణ గౌడ్ ఆరోపించారు. దీనిపై ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే దీనిపై మరో నిర్వహకుడు వెంకట్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ గోశాల నిర్వహణ పేరుతో తాళ్ల బాలకృష్ణగౌడ్ 2015 నుంచి 2021 వరకు తన స్వంత అకౌంట్‌కు ప్రజల నుంచి సుమారు రూ.32లక్షలు వచ్చాయని, దుకాణాల వద్ద ఉండే గోశాల డబ్బాల సోమ్ము కూడా తాను స్వంతానికి వాడుకున్నారని ఆరోపించారు. ఎద్దులు ఎక్కువగా ఉండి నిర్వహణ భారంగా మారడంతో రైతుల నుంచి పాసు బుక్‌లు తీసుకుని పలువురికి ఉచితంగా అందజేశామని వెంకట్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే విదేశాల నుంచి బాలకృష్ణగౌడ్ అకౌంట్‌లో డబ్బులు వేయించుకుంటున్నారని ఆయన ఆరోపించారు. కాగా దీనిపై ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు విచారణ చేపట్టారు. నిర్వహకులను పిలిచి విచారణ చేస్తున్నారు. ఏది ఏమైనా గోశాల నిర్వహకుల మధ్య విబేదాలతో మరోసారి గోవుల వ్యాపారం బట్టబయలు అయ్యింది. పోలీసులు దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



పనులను పరిశీలిస్తున్న దాము మహేందర్‌యాదవ్

**ఎల్.బి.నగర్, జూన్ 20 ప్రభాతవార్త:**
అభివృద్ధి పనుల విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని పిసిసి క్యాంపెనింగ్ కమిటీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ దాము మహేందర్‌యాదవ్ పేర్కొన్నారు. చైతన్యపురి డివిజన్ న్యూమారుతినగర్ కాలనీలో మంచి నీటి పైప్‌లైన్‌లో డ్రైనేజీనీరు కలుషితమవుతుండడంతో జలమండలి అధికారులు శనివారం మరమ్మతులు చేపటగా పనులను మహేందర్‌యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో లీకేజీ జరగకుండా పైప్‌లైన్ నిర్మాణం పనులను పటిష్టంగా చేయాలన్నారు. నాణ్యతతో పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. పనుల విషయంలో ఏమైనా సమస్యలు ఎదురైతే తన దృష్టికి తీసుకువస్తే ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మధుయాష్కిగౌడ్ ద్వారా పనులు త్వరగా పూర్తయ్యేటట్లు చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకు లు నాగార్జునరెడ్డి, కాలనీవాసులు నిరంకి జగదీశ్వర్ పాల్గొన్నారు.

## బొడ్రాయి పండుగకు రామచందర్‌రావుకు ఆహ్వానం



రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రామచందర్‌రావుకు ఆహ్వాన పత్రికను ఇస్తున్న కొలన్ శంకర్‌రెడ్డి

**సరూర్‌నగర్, జూన్ 20 ప్రభాతవార్త:** బాలాపూర్ గ్రామంలో ఈ నెల 27వ తేదీన బొడ్రాయి (నాభిశిల) పునః ప్రతిష్టాపనోత్సవం జరుగునున్న నేపథ్యంలో కార్యక్రమానికి హాజరుకావాలని తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావును రాష్ట్ర బిజెపి కో-ఆపరేటివ్ సెల్ కో-కన్వీనర్, సింగిల్ విండో మాజీ ఛైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి కోరారు. శనివారం ఆయన రామచందర్‌రావును మర్యాదపూర్వకంగా కలిసి బొడ్రాయి ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఈ కార్యక్రమానికి హాజరుకావాలని శంకర్‌రెడ్డి కోరారు.

## శ్రీశైలం రహదారిని నాలుగు లైన్లుగా అభివృద్ధి చేయాలి

**కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కోరిన బిజెపి నేతలు**



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న అందెల శ్రీరాములు యాదవ్, బొక్క నర్సింహారెడ్డి

**సరూర్‌నగర్, జూన్ 20 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం గుండా వెళ్తున్న శ్రీశైలం రహదారిని నాలుగు లైన్లుగా విస్తరించి అభివృద్ధి చేయాలని నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్, రంగారెడ్డి జిల్లా బిజెపి మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డిలు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి విచ్చేసిన సందర్భంగా వారు కేంద్ర మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. గతంతో పోలిస్తే శ్రీశైలం హైవేలో వాహనాల రద్దీ పెరిగిందనీ అంతే కాకుండా రహదారి పరిసర గ్రామాల పరిధిలో నివాస ప్రాంతాలు పెరిగి జనాభా కూడా ఎక్కువైందని అన్నారు. ఈ నేపథ్యంలో రహదారిని విస్తరించి అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని వారు తెలిపారు. అయితే తమ వినతికి స్పందించిన కిషన్‌రెడ్డి రోడ్డు విస్తరణ అభివృద్ధి పట్ల సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. హైవే విస్తరణ పనులు డిపిఆర్ పరిశీలన స్థాయిలో ఉన్నాయనీ వచ్చే సంవత్సరం నాటికి రోడ్డు పనులు ప్రారంభం అవుతాయని కేంద్ర మంత్రి పేర్కొన్నట్లు వారు తెలిపారు.

## ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలలో యోగా వేడుకలు



ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలలో యోగా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ప్రోగ్రాం ఆఫీసర్ డా.ప్రశాంత్, ప్రిన్సిపల్ జయంతిరెడ్డి తదితరులు

**ఉప్పల్, జూన్ 20 ప్రభాతవార్త :** ఉప్పల్‌లోని లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు మరియు అధ్యాపక సభ్యుల భాగస్వామ్యంతో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. ప్రశాంత్, వి. నవీన్ కుమార్ ప్రిన్సిపాల్ పి. జయంతి రెడ్డి, డైరెక్టర్ రెవ. బ్రదర్ జాన్ కల్లరక్కల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సంపూర్ణ అభివృద్ధి మరియు అంతర్గత సామరస్యాన్ని సాధించడానికి యోగాను వారి దినచర్యలో భాగం చేసుకోవాలని సూచించారు. యోగా గురువు జి. ఎన్. ప్రణయ్ కుమార్ నాయుడు యోగా సెషన్‌కు నాయకత్వం వహించగా, ట్రైనర్ దివ్య సమర్థవంతంగా సహకరించారు. నిపుణులు ఒత్తిడి నిర్వహణ, ఏకాగ్రత పెంపు, మరియు సంపూర్ణ శ్రేయస్సులో వాటి ప్రాముఖ్యతను వివరిస్తూ, వివిధ యోగాసనాలు, ప్రాణాయామ పద్ధతులు, మరియు ధ్యాన అభ్యాసాలను ప్రదర్శించారు. విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని, క్రమం తప్పని యోగా సాధన వల్ల కలిగే ప్రయోజనాలపై విలువైన అవగాహన పొందారు. ఆరోగ్యం, జాగరూకత, మరియు యోగాను ఒక జీవన విధానంగా స్వీకరించడాన్ని ప్రోత్సహించే సందేశంతో ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## సందడిగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుక



స్కూల్ ఆవరణలో యోగా చేస్తున్న విద్యార్థులు స్కూల్ టీచర్లు

**నాచారం, జూన్ 20 ప్రభాతవార్త :**
నాచారంలోని డెక్కన్ స్ప్రింగ్ గ్లోబల్ స్కూల్ ల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఎంతో ఉత్సాహంతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వేదికపై వచ్చి, ఆసనాలు, ప్రాణాయామంతో కూడా ఒక సుందరమైన క్రమాన్ని ప్రదర్శించారు, కామన్ యోగా ప్రోటోకాన్‌ను సమర్పించారు. వారి అద్భుతమైన ఏకాగ్రత, శరీర సౌలభ్యం, మరియు సమన్వయం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇది సంపూర్ణ విద్య పట్ల పాఠశాల యొక్క నిబద్ధతను ప్రతిబింబించింది. ఈ కార్యక్రమానికి ఆర్ట్ ఆఫ్ లివింగ్ సీనియర్ ఫ్యాకల్టీ ప్రణయ్ కుమార్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్ దివ్య మార్గదర్శకత్వం వహించారు. వారి సమక్షం ఈ కార్యక్రమానికి మరింత శోభను చేకూర్చింది. ఆయన స్ఫూర్తిదాయక ప్రసంగంలో, ముఖ్య అతిథి విద్యార్థుల దోషరహిత ప్రదర్శనను ప్రశంసించారు. యోగాను జీవితంతో ఆచరించే సాధనంగా స్వీకరించమని వారిని కోరారు. యోగా కేవలం వ్యాధులను మాత్రమే కాదు, అది మీతో, ప్రపంచంలో ఏకత్వాన్ని కనుగొనే ఒక ప్రయోగం," అని అయన నొక్కి చెప్పారు. వేడుక యొక్క ఉత్సాహాన్ని మరింత పెంచుతూ, కోర్ హెడ్ ఆపరేషన్స్ కిషోర్ కుమార్ రెడ్డి, ఈ కార్యక్రమానికి తమ అమూల్యమైన మార్గదర్శకత్వం, సహకారం అందించిన విశిష్ట అతిథులను సత్కరించారు. యాజమాన్యం చైర్మన్ కె. సవనీత రావు, మేనేజర్ డైరెక్టర్ కె. నవీన్ కుమార్, డైరెక్టర్ డా. కమలా మోహన్ రావు - విద్యార్థులు, ఉపాధ్యాయుల అంకితభావంతో కూడిన కృషిని అభినందించారు.

## 28న తార్నాక వంజరి సంఘం రాష్ట్ర కార్యలయంలో అత్యవసర సమావేశం

**తార్నాక, జూన్ 20 ప్రభాతవార్త :** కుల సంఘ ఎన్నికల నిర్వహణపై చర్చించేందుకు జూన్ 28న ఆదివారం ఉదయం 11 గంటలకు తార్నాకలోని సంఘ భవనంలో అత్యవసర సమావేశాన్ని నిర్వహించాలని శనివారం జరిగిన సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశానికి కులస్థులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని సంఘ అధ్యక్షుడు కాలేరు నరేందర్, ప్రధాన కార్యదర్శి కందారి వెంకటేశం, కోశాధికారి కాలేరు అమరేందర్ కోరారు. అదేవిధంగా, ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా విద్యారంగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసానికి ప్రోత్సాహకంగా ఆగస్టు 15న ఆర్థిక సహాయాన్ని అందజేయనున్నట్లు వారు తెలిపారు. విద్యకు ప్రాధాన్యత ఇస్తూ ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడం సంఘం లక్ష్యమని పేర్కొన్నారు. సమావేశానికి అధిక సంఖ్యలో కుల స్థులు హాజరై విజయవంతం చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.

## రూ.67లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



ఉప్పల్ అంబేడ్కర్‌నగర్‌లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బన్నాల గీత తదితరులు

**ఉప్పల్, జూన్ 20 ప్రభాతవార్త :** ఉప్పల్ బీరప్పగడ్డ డివిజన్‌లో రూ.67 లక్షల రూపాయల వ్యయంతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను శనివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. మాజీ కార్పొరేటర్ బన్నాల గీత తదితరులతో కలిసి డివిజన్ పరిధిలోని అంబేడ్కర్‌నగర్, బాలాజీ ఎన్‌క్లేవ్, శ్రీనగర్ కాలనీలలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ చిలుకానగర్ డివిజన్‌లో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని, పెండింగ్‌లో ఉన్న పనులు దశలవారిగా పూర్తి చేస్తున్నామని తెలిపారు. డివిజన్‌లో ఒక ప్రణాళిక ప్రకారం పనులు చేపట్టారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. మాజీ కార్పొరేటర్ గీత మాట్లాడుతూ బీరప్ప గడ్డ డివిజన్‌లో అత్యధిక నిధులు వెచ్చించి అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. రూ.26లక్షలతో అంబేద్కర్ నగర్ కమ్యూనిటీ హాల్ పై అంతస్తు, రూ.16లక్షలతో శ్రీనగర్ కాలనీ కమ్యూనిటిహాల్, రూ.11లక్షలతో బాలాజీ ఎన్‌క్లేవ్‌లో మరుగుదొడ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నేతలు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఉప్పల్ డివిజన్ అధ్యక్షుడు ముశ్యం శ్రీనివాస్, జెల్లి మోహన్, పల్లె రాజ్ కుమార్, కె.జగన్, కొండల్‌రెడ్డి, మేడిపల్లి నవీన్‌చారి, కాలనీ నేతలు వేణుగోపాల్‌రెడ్డి, ఓంకార్‌సింగ్, తెల్కల సుదర్శన్‌రెడ్డి, రమేష్‌గౌడ్, మాస శేఖర్ పలువురు కాలనీ నేతలు పాల్గొన్నారు.

## యోగాను పోలీసులు దైనందిక జీవితంలో ఓ భాగంగా చేసుకోవాలి

**శంషాబాద్ జోన్ డిసిపి రాజేష్ పిలుపు**



పోలీసులతో కలిసి యోగా సాధన చేస్తున్న శంషాబాద్ జోన్ డిసిపి రాజేష్, ఆదిభట్ల ఏసిపి ప్రదీప్‌కుమార్‌రెడ్డి

**సరూర్‌నగర్, జూన్ 20 ప్రభాతవార్త:** పోలీసులు యోగాను తమ దైనందిక జీవితంలో భాగంగా చేసుకోవాలని శంషాబాద్ జోన్ డిసిపి బి.రాజేష్ పిలుపునిచ్చారు. బాలాపూర్ ఆర్‌సిఐ రోడ్డులోని ఎస్‌పిఆర్ (సామల పాపిరెడ్డి కన్వెన్షన్)లో శనివారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిత్య యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన డిసిపి రాజేష్, ఆదిభట్ల ఏసిపి ప్రదీప్‌కుమార్‌రెడ్డి, ఆర్టీఐఏ డివిజన్ ఏసిపి వి.శ్రీకాంత్‌గౌడ్, వివిధ పోలీస్ స్టేషన్ల ఇన్స్‌పెక్టర్లు, ఎస్ఐలు, పోలీసులు సామూహిక యోగా చేశారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని డిసిపి మాట్లాడుతూ నిత్య యోగా సాధనతో శారీరక, మానసిక ఆరోగ్యం పెంపొందుతుందని అన్నారు. అంతే కాకుండా విధి నిర్వహణలో ఏకగ్రతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో పోలీసులతో పాటు ప్రతి ఒక్కరూ ప్రతి రోజూ యోగాభ్యాసం చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బాలాపూర్, మీర్‌పేట్, పహాడీషరీఫ్, ఆదిభట్ల ఎస్‌హెచ్‌ఓలు ఎం.సుధాకర్, బి.శోభన్, బి.లక్ష్మీనారాయణరెడ్డి, బి.రవికుమార్, ఆర్‌జిఐఏ ఎస్‌హెచ్‌ఓతో పాటు ఆయా పిఎస్‌ల ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, మహిళా కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.